
సాక్షి
పల్నాడు
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 51,019 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 51,019 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 6034 క్యూసెక్కులు వదిలారు. బ్యాంక్ కెనాల్‌కు 1526 క్యూసెక్కులు వదిలారు.



దుప్పట్లు పంపిణీ

తాడేపల్లిరూరల్: జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు మంగళవారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

ఉప్పలపాడు గణపతి లడ్డూ రూ.2.30 లక్షలు



నరసరావుపేట రూరల్: ఉప్పలపాడులోని గణేష్ మండపంలో నిర్వహించిన వేలంలో లడ్డూ ధర రూ.2.30లక్షలు పలికింది. ఉప్పలపాడులోని లైబ్రరీ సెంటర్‌లో టీమ్ ఏకదంత ఆధ్వర్యంలో 17 సంవత్సరాలుగా మండపం ఏర్పాటుచేసి గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. మండపంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుడిని సోమవారం నిమజ్జనానికి తరలించారు. 53 కిలోల లడ్డూకు వేలం నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలంలో గ్రామానికి చెందిన యన్నం రాధాకృష్ణారెడ్డి రూ.2.30 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గ్రామంలో నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. డీజె, డప్పులతో సాగిన ఊరేగింపులో యువత, మహిళలు సందడి చేశారు. గంటావారిపాలెం వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో నిమజ్జనం పూర్తిచేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

మాచర్ల: పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో నాల్గవ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్‌బాబు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్నీ ధ్రువీకరణ పత్రాలతో ఐటీఐ. ఏపీ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్, మెకానికల్, వెల్డర్ విభాగాలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 27న తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో మధ్యాహ్నం 3గంటలలోపు రశీదు పొందాలన్నారు. సెప్టెంబర్ 25న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలు విరివిగా నాటుదాం



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ గిరిప్రదక్షిణ రోడ్డులోని గిరి వన విహార్ నగర వనంలో మంగళవారం మొక్కలు నాటారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల సహకారంతో అటవీశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గిరి వన విహార్ స్థలంలో నాగమల్లి, రుద్రాక్ష, మారేడు, కదంబం, ఉసిరి, సింహాచలం తదితర మొక్కలు నాటినట్లు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థలు 749 మొక్కలను అటవీ శాఖకు అందజేసినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటి సంరక్షణను చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఉమాధవ్, వినుకొండ రేంజ్ అధికారి మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 47,720 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 47,720 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 43,418 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,492 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ బడి.. బోధన తడబడి

- పూర్వ ప్రాథమిక విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- రెండు నెలలు దాటినా అందని పాఠ్యపుస్తకాలు
- పుస్తకాలు లేకపోవడంతో బోధనకు ఆటంకం
- పాత పుస్తకాలతోనే బోధన
- జిల్లాలో 2,031 అంగన్‌వాడీ కేంద్రాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధన చేస్తున్న కార్యకర్త(ఫైల్)

సత్తెనపల్లి: చదువులకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు. సకల సౌకర్యాల మధ్యన ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట బొమ్మలతో, ఆకట్టుకునే పుస్తకాలతో చిన్నారులకు విద్య నందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల భవితను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలు పున:ప్రారంభించి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు పిల్లలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు. చిన్నారులకు ఆట పరికరాలకు కిట్లు కూడా అందజేయలేదు. పాత పుస్తకాలు, కిట్లతోనే అంగన్‌వాడీ కార్యకర్తలు బోధన సాగిస్తున్నారు. బాల్య దశలోనే విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఆటపాటలతో కూడిన విద్యా బోధనకు వీలుగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఏటా ఠంఛన్‌గా పుస్తకాలు సరఫరా చేసేది. ఆట పరికరాలను సమకూర్చేది. పౌష్టికాహారంతోపాటు బోధన ఆహ్లాదంగా సాగేందుకు అనువైన వసతులు కల్పించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ విధానాలకు మంగళం పాడింది. బాల్య దశలోనే విద్యాపరంగా గట్టి పునాదులు వేసే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తుండడం చిన్నారుల తల్లిదండ్రులను కలవరపెడుతోంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే పుస్తకాలు సరఫరా చేయాలన్న డిమాండ్ వినిపిస్తుంది.

ప్రశ్నార్థకంగా చిన్నారుల భవిష్యత్తు

జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 2,010 అంగన్‌వాడీ కేంద్రాలు, 21 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 26,844 మంది ప్రీ స్కూల్ పిల్లలు చదువుతున్నారు. వీరందరికీ ఈ ఏడాది పాఠ్యపుస్తకాలు అందలేదు. చిన్నారులకు బోధించేందుకు పుస్తకాల లేమి సమస్య వెంటాడుతుంది. కొన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతో అరకొరగా విద్యా బోధన సాగిస్తున్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చిన్నారులు ప్రీ స్కూల్‌కు ఎక్కడ చేరితే అదే విద్యాసంస్థలోనే విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తే చిన్నారులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎల్‌కేజీ, యూకేజీల్లో చేరతారు. ఆ తర్వాత కూడా ప్రైవేటు పాఠశాలల్లోనే చదువు కొనసాగిస్తారు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలకు మేలు చేకూరుతుంది. కేవలం కార్పొరేట్ విద్యా సంస్థలకు మేలు చేకూర్చేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

పుస్తకాల సరఫరా ఆలస్యం కాలేదు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాల సరఫరాకు సంబంధించి ఆలస్యం కాలేదు. ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలలో జిల్లాకు ఎలాట్‌మెంట్ ఇచ్చిన ప్రకారం వారు ముద్రించి సరఫరా చేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా అలాగే వస్తాయి. 2023లో కూడా జూన్‌లో ఇవ్వలేదు. అక్టోబర్‌లోనే ఇచ్చాం. ఆ పుస్తకాలు ఇప్పటి వరకు వాడుకుంటారు. మళ్లీ ఇప్పుడు అక్టోబర్‌లో ఇస్తాం.

–కె.ఉమారాణి,
పీడీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పల్నాడు

భవిష్యత్తుకు గట్టి పునాది పడేలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్–1 కిట్టు అందేది. అంగన్‌వాడీల్లో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల తరహాలోనే చిన్నారులకు విద్యాబోధన సాగింది. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్ యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1 కిట్లు అందజేసింది ఐదేళ్లలోపు పిల్లలకు కూడా ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–2 కిట్లు ఇచ్చింది. దీంతో వారికి బోధన చాలా సులభంగా, అర్థమయ్యే రీతిలో సాగేది. కొత్త ప్రభుత్వం పుస్తకాల సరఫరాకు మంగళం పాడి పాత విధానాన్ని అమల్లోకి తెచ్చే ఆలోచనతో ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పట్టణంలోని క్రిస్టియన్‌పేటలో గల అంగన్‌వాడీ మోడల్ ప్రీ స్కూల్ భవనం

విద్యార్థులందరికి మాత్రలు అందించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు
- డీవార్మింగ్ డే ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేటఈస్ట్: జిల్లాలోని పాఠశాలల విద్యార్థులలో నులి పురుగులను అరికట్టేందుకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని క్షీణింపచేసే నులి పురుగులను అరికట్టేందుకు మంగళవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో డీవార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ నులి పురుగులు చిన్నారుల ఆరోగ్యాన్ని క్షీణింప చేస్తాయన్నారు. డీవార్మింగ్ డే పురస్కరించుకొని ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరికీ మాత్రలు అందించాలని సూచించారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత మాత్ర తీసుకోవాలన్నారు. 1 నుంచి 5 సంవత్సరాలలోపు ఉన్న వారికి అరమాత్ర నీటిలో కరిగించి తాగించాలన్నారు. 6 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి ఒక మాత్ర తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ చిన్నారులు మట్టిలో ఆడుకోవటం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోకపోవటం వలన పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. 50 శాతానికి పైగా చిన్నారులు ఏదో ఒక రకం నులి పురుగుల బారిన పడి రక్తహీనతకు, అనారోగ్యానికి గురవుతుంటారని వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ నులిపురుగుల ద్వారా పిల్లల్లో ఎదుగుదల లోపం, రక్తహీనత ఏర్పడుతుందని తెలిపారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- హాస్టల్‌లో ఉరేసుకున్న బాలిక
- సంఘటన స్థలంలో సూసైడ్ నోట్ స్వాధీనం
- కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు



మృతురాలు జయలక్ష్మి

నరసరావుపేటటౌన్: నరసరావుపేటలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. రొంపిచర్ల మండలం వడ్లమూడివారి పాలెం గ్రామానికి చెందిన పల్లపు జయలక్ష్మి(14) నరసరావుపేటలోని హర్డ్ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. పాఠశాలకు అనుబంధంగా ఉన్న వసతి గృహంలో ఉంటుంది. వరుసగా ప్రభుత్వ సెలవులు రావడంతో నాలుగు రోజుల కిందట స్వగ్రామం వెళ్లింది. తిరిగి సోమవారం పాఠశాలకు వచ్చింది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి హాస్టల్‌కు వచ్చింది. తోటి విద్యార్థులతో కలిసి భోజనానికి వెళ్లకుండా హాస్టల్ రూములోనే ఉండిపోయింది. విద్యార్థినులు భోజనం ముగించుకుని హాస్టల్ రూముకు వచ్చేసరికి గదిలో జయలక్ష్మి చున్నీతో ఫ్యానుకు ఉరేసుకుని కనిపించింది. విద్యార్థులు స్కూలు యాజమాన్యానికి తెలియజేయగా, వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ హైమారావు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించారు. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు.

సూసైడ్ నోట్ స్వాధీనం

హాస్టల్‌లోని విద్యార్థిని గదిలో పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. అందులో 'ఐ లవ్ మై పేరెంట్స్, చరణ్, జయలక్ష్మి' అంటూ సుమారు 20 సార్లు రాసి ఉంది. ఆమె ఎడమ చేతిపై చరణ్ అని పెన్నుతో రాసి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. వీటి ఆధారంగా పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. మృతికి ప్రేమ వ్యవహారమా? మరేదైనా కారణమా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల ఆందోళన

సంఘటన స్థలానికి వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు యలమందయ్య, సుభాషిణి విలపించారు. తమ కుమార్తె మృతికి కళాశాల యాజమాన్య నిర్లక్ష్యమేనని ఆందోళన చేపట్టారు.

బలవంతంగా వినాయక విగ్రహం తరలింపు

- అడ్డు వచ్చిన మహిళలు, గ్రామస్తులపై పోలీసుల లాఠీచార్జి
- వైఎస్సార్ సీపీ నేత రావెళ్ల రాజేష్ ఇంటిపై టీడీపీ నాయకుల దాడి
- అర్ధరాత్రి పోలీసుల ఓవర్ యాక్షన్

నరసరావుపేట: టీడీపీ ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటిస్తున్న పోలీసులు అచ్చంపేట మండలం గ్రంథశిరిలో సోమవారం అర్ధరాత్రి ఓవర్ యాక్షన్ చేశారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్న విఘ్నాధిపతిని ఘనంగా సాగనంపేందుకు ఏర్పాటుచేసుకున్న శోభాయాత్రను అపహాస్యం చేశారు. పోలీసుల అండదండలతో టీడీపీ వర్గీయులు, టీడీపీ అధిష్టానం ఆదేశాలతో పోలీసులు గ్రామంలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. గ్రంథశిరిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్న మండపంలో 10 అడుగుల విఘ్నేశ్వరుడిని నెలకొల్పారు. తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించి 10వ రోజైన సోమవారం శోభాయాత్రగా వెళ్లి పవిత్ర కృష్ణా నదిలో నిమజ్జనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు పోలీసులు యాత్రను అడ్డుకోగా గత్యంతరం లేని పరిస్థితులలో నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై నుంచి దింపి తిరిగి మండపంలో పెట్టుకున్న విషయం పాఠకులకు విదితమే. హంగులు, ఏర్పాట్లు ఏమీ లేకుండా నిమజ్జనం చేసుకోవాలని, లేకుంటే మీపై కేసులు బుక్‌చేస్తానంటూ అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి ఉత్సవ కమిటీ సభ్యులను బెదిరించినా, మీ బెదిరింపులకు లొంగేది లేదంటూ రాష్ట్రంలో మరో ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తుందని, అప్పటివరకు వినాయకస్వామికి నిత్యపూజలు చేసుకుంటామంటూ వైఎస్సార్ సీపీకి చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు భీష్మించి కూర్చున్నారు.



వినాయక విగ్రహాన్ని క్రేన్‌తో ట్రాక్టరు ట్రక్కుపైకి ఎక్కిస్తున్న పోలీసులు

వైఎస్సార్ సీపీ నేత రావెళ్ల రాజేష్ ఇంటిపై దాడి

వైఎస్సార్ సీపీ నేత రావెళ్ల రాజేష్ ఇంటిపై దాడులకు తెగబడ్డారు. దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించి సామన్లు చిందరవందర చేశారు. కొన్ని సామాన్లు పగులకొట్టారు. ఇంటి బయట ఉన్న బైకును ధ్వంసం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్రే వహించారే తప్ప అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.

అర్ధరాత్రి పోలీసుల హంగామా

ఇక్కడ నుంచే పోలీసుల ఓవర్ యాక్షన్, హైడ్రామా మొదలైంది. గ్రామంలో 200 మందికిపైగా పోలీసు బలగాలను దింపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో క్రేన్ తీసుకొచ్చి మండపంలోని వినాయకుడిని సాధారణ ట్రక్కులోకి ఎక్కించారు. మహిళలు, గ్రామస్తులు ట్రక్కుకు అడ్డుగా రోడ్డుపై బైఠాయించారు. వారిపై పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టి వినాయకుడికి తరలించారు.



రోడ్డుపై బైఠాయించిన మహిళలు, గ్రామస్తులు

వంట నూనె ధరలు సలసల!

కేంద్ర నిర్ణయంతో వంట నూనెల ధరలు సలసల కాగుతున్నాయి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలను ఇప్పటికే ఇబ్బంది పెడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటుతున్నా ధరల నియంత్రణకు తీసుకున్న చర్యలు శూన్యం. దీనికి తోడు రోజు వంటకాల్లో ఉపయోగించే నూనెలపై కేంద్రం 20 శాతం మేర సుంకం పెంచింది. దీంతో లీటరు వంట నూనెపై రూ.20 నుంచి రూ.25 వరకు అదనపు భారం ప్రజలపై పడుతోంది.

- దిగుమతులపై సుంకం పెంచిన కేంద్ర ప్రభుత్వం
- లీటరుకు రూ. 20 – రూ. 25 వరకు అదనం
- ఇప్పటికే కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- జిల్లా ప్రజలపై ఏడాదికి రూ.78.12 కోట్ల భారం



సత్తెనపల్లి: వంట నూనెలపై సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి ముడి సరుకుగా దిగుమతి చేసుకునే వంట నూనెలకు గతంలో ఎటువంటి (బేసిక్ కస్టమ్స్ డ్యూటీ) సుంకాలు లేవు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వాటిపై 20 శాతం మేర దిగుమతి సుంకాన్ని విధించింది. అలాగే శుద్ధి (రిఫైన్డ్) చేసిన వంట నూనెలపై గతంలో 12.5 శాతం ఉన్న సుంకాన్ని 32.5 శాతానికి పెంచేసింది. దీంతో ప్రతి లీటర్ ప్యాకెట్ కు రూ. 20 నుంచి రూ. 25 వరకు అదనపు భారం పడుతోంది. వంట నూనెల పెరుగుదలతో జిల్లా ప్రజలపై ప్రతి నెల రూ.6.51 కోట్లు, ఏడాదికి రూ.78.12 కోట్ల భారం పడుతోంది. జిల్లాలో 6.51 లక్షల కుటుంబాలు ఉండగా ఒక్కో కుటుంబం నెలకు సగటున ఐదు కిలోల వంట నూనె వినియోగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విధించిన సుంకాలను అవకాశంగా తీసుకొని హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఇప్పటికే నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలుచోట్ల నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. వినియోగదారులను బట్టి చిన్న దుకాణాల్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ధరలను అదుపు చేసే విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ–కామర్స్ సంస్థలు కూడా వంట నూనెల విక్రయాలను పూర్తిగా నిలిపివేశాయి. శనివారం సాయంత్రం వరకు బాగానే ఉన్నా.. అదే రోజు రాత్రి నుంచి అవుట్ ఆఫ్ స్టాక్ అంటూ డిస్‌ప్లే చేస్తున్నాయి. అధిక ధర ఉన్న ప్రముఖ కంపెనీలకు చెందిన స్టాక్ మాత్రమే ఉంచాయి. చౌక ధరల దుకాణాల ద్వారా రాయితీపై వంట నూనెలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని ప్రజలు కోరుతున్నారు. కందిపప్పు, వంట నూనెలను సరఫరా చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చినా ఇప్పుడు అమలు కావడం లేదు. దీంతో ఇకనైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నూనెల పాత, కొత్త ధరలను పట్టికలో చూడొచ్చు.

రకం	పాత ధర	కొత్త ధర (రూ.లలో)
పామాయిల్	95	115
సన్‌ఫ్లవర్	115	135
సోయాబీన్	108	130
వేరుశనగ	157	178
రైస్‌బ్రాన్	118	135

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నివేదికలు అందజేయండి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట:రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి నివేదికలు వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలు, పురోగతిపై శాఖల వారీగా వ్యవసాయం, సెరీకల్చర్, అటవీ, కో–ఆపరేటివ్, ఇరిగేషన్, విద్యాశాఖ, టిడ్కో గృహాలు, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలు, సాంఘిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం, ఎక్సైజ్, వివిధ శాఖలతో సమీక్షించారు. నియోజకవర్గానికి ఒక రైతుబజారు ఉండేలా స్థలాన్ని సేకరించి రైతుబజార్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని, తగు విధంగా ప్రణాళికలు రూపొందించాలని మార్కెటింగ్ శాఖ అధికారికి సూచించారు. లక్ష్య సాధనలో ఆర్థికేతరంగా చేయగలిగినవి, సులభతరంగా ఉన్న వాటిని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆయా శాఖల ప్రధాన అధికారులు నిర్దేశించిన పనులు పూర్తి చేయాలన్నారు. భూసార పరీక్షలు నిర్దేశిత లక్ష్యం అనుగుణంగా పూర్తిచేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేయాలన్నారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, సీపీవో శ్రీనివాసరావు ఉన్నారు.

క్లుప్తంగా

ఔత్సాహికులకు స్కిల్ అండ

నరసరావుపేట ఈస్ట్: ఔత్సాహిక వ్యాపారవేత్తలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అండగా ఉంటుందని జిల్లా అధికారి కె.సంజీవరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో స్టార్ట్ యువర్ బిజినెస్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువతకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని యువత ఉపాధి పొందాలని సూచించారు. యువతకు అండగా ఉంటూ అన్ని విధాల ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్ర ప్రసాద్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి డీఎస్పీగా హనుమంత రావు



సత్తెనపల్లి: సత్తెనపల్లి డీఎస్పీగా మేదరమెట్ల హనుమంతరావును మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి ఐదున సత్తెనపల్లి డీఎస్పీగా వచ్చి ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన డీఎస్పీ జి.గురునాథ్‌బాబు రిలీవ్ అయ్యారు. ఆయనను పోలీస్ హెడ్ క్వార్టర్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీహెచ్ ద్వారకా తిరుములరావు నుంచి ఇటీవల ఉత్తర్వులు వెలువడ్డాయి. 1991 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన హనుమంతరావు ఎస్ఐగా సత్తెనపల్లి, గుంటూరు కొత్తపేట, పెదకాకాని, నరసరావుపేట, పిడుగురాళ్లలో పని చేశారు. సీఐగా గుంటూరు లాలాపేట, అమరావతి, పిడుగురాళ్ల, నెల్లూరు జిల్లా గూడూరులో పని చేశారు. మూడేళ్ల క్రితం డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన ప్రస్తుతం పీసీఎస్ అండ్ ఎస్ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నాడు 2001 నుంచి 2003 వరకు సత్తెనపల్లి ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయన నేడు డీఎస్పీగా తిరిగి సత్తెనపల్లి రావడం విశేషం. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ కంచి శ్రీనివాసరావును కలిసేందుకు నరసరావుపేట వెళ్లారు.

నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద జరిగిన వినాయక నిమజ్జన వేడుకల్లో ప్రమాదవశాత్తు కాల్వలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండల మిన్నెకల్లు గ్రామానికి చెందిన కెల్లంపల్లి ప్రతాప్ (40) వినాయక విగ్రహాన్ని కాల్వలో పడివేసే సమయంలో తాను కూడా కాల్వలో దూకాడు. ఈక్రమంలో కాల్వలోని నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగటంతో గల్లంతైనట్లు ఎస్సై తెలిపారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సారథ్యంలో గజ ఈతగాళ్ళు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అందరికీ ఆదర్శప్రాయుడు వావిలాల

- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల 118వ జయంతి వేడుకలు



వావిలాల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: స్వాతంత్ర సమరయోధుడు, సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాల కృష్ణయ్య అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర జలవనరుల శాఖ మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో మంగళవారం నిర్వహించిన వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వావిలాల గోపాల కృష్ణయ్య సత్తెనపల్లి శాసన సభ్యుడిగా చాలా కాలం పనిచేశారన్నారు. ఆయన సత్తెనపల్లిలో పుట్టి పెరిగి ఒక ఆదర్శప్రాయమైన జీవితం గడిపిన మహానుభావుడని కొనియాడారు. స్వాతంత్రం కోసం పోరాడటమే కాకుండా నూతన సమాజం కావాలని నిరంతరం పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. శాసనసభ్యునిగా ఉన్నా చాలా సాధారణ జీవితం గడిపారన్నారు. మద్యపాన నిషేధం కోసం తన జీవితంలో చాలా పోరాటాలు చేశారని, ఆయనను అందరూ ఆంధ్రగాంధీగా అంటారని అంతటి గొప్ప వ్యక్తి అన్నారు. అలాంటి వ్యక్తి సత్తెనపల్లి వాసి కావడమనేది మనందరికీ గర్వకారణంగా భావిస్తున్నానన్నారు. ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతతో పాటు ప్రజలపై ఉందన్నారు. ముందుగా వావిలాల గోపాలకృష్ణయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వావిలాల గోపాలకృష్ణయ్య మనవడు మన్నవ సోడేకర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల.రాజనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, సత్తెనపల్లి, నకరికల్లు మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, భవనం రాఘవరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నాయకులు బండి మల్లి కార్జునరెడ్డి, సందెపోగు గాంధీ, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, మందడపు సాయి, షేక్ మహమ్మద్ హనీఫ్, జంగాల సంపత్ కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

బైపాస్‌కు ఇరువైపులా మొక్కలునాటే కార్యక్రమం



గణపవరంలో బైపాస్ వద్ద మొక్కలు నాటుతున్న పీడీ పార్వతీశం, అధికారులు

నాదెండ్ల: నేషనల్ హైవే - చిలకలూరిపేట బైపాస్‌లోని అప్పాపురం డొంక క్యాటిల్ అండర్ పాస్ సమీపంలో హైవే అధికారులు స్వచ్ఛతా హి సేవ-24 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' అంటూ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తమ తల్లుల పేరిట ఒక్కో మొక్కను నాటారు. గణపవరం జెడ్పీ హైస్కూలు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం, బైపాస్ పీడీ మురళీమోహన్, మేనేజర్ జగదీష్, టీం లీడర్ సోమరాజు, బీఎస్‌సీపీఎల్ ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్‌ఖాదర్, డీపీఎం శ్రీనివాసరావు, సైట్ ఇంజినీర్ కళ్యాణ్, గణపవరం హైస్కూలు ఎన్‌సీసీ ఆఫీసర్ మహమ్మద్ రసూల్, హెచ్ఎం కృష్ణానాయక్ పాల్గొన్నారు. ముందుగా పీడీ పార్వతీశం మాట్లాడుతూ పచ్చటి మొక్కలతో స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం సాకారమౌతుందని, కాలుష్యాల రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఆదేశాల మేరకు హైవేల వెంబడి భారీస్థాయిలో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట బైపాస్ 16.5 కిలోమీటర్ల పరిధిలో కుడివైపున మూడు వరుసల ఎవెన్యూ ప్లాంటేషన్, సెంట్రల్ డివైడర్‌పై పూలమొక్కలు, ఎడమ వైపున ఖాళీ ప్రదేశాన్ని బట్టి మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. గానుగ, వేప, నల్లమద్ది, గుల్‌మోర, పెంట్‌ఫామ్ తదితర ఆరు వేల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. రెండు వైపులా గ్రీన్ టర్ఫిన్ గ్రాస్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైవే ఆక్రమణలకు గురికాకుండా సర్వీసు రోడ్డుకు ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మొక్కకు ట్రీగార్డు ఏర్పాటు చేసి, మొక్కలు చెట్లయ్యే వరకూ సంరక్షించనున్నట్లు తెలిపారు.

సోలార్ వెలుగులు...

చిలకలూరిపేట బైపాస్ 16.5 కిలోమీటర్ల పరిధిలో కొంత భూమిని సోలార్ మాడ్యూల్స్ ఏర్పాటుకు కేటాయించినట్లు తెలిపారు. సోలార్ ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించి గ్రిడ్ ద్వారా నిరంతరం విద్యుత్ పొందనున్నట్లు తెలిపారు. బైపాస్ ప్రాజెక్టులో భాగంగానే సోలార్ ఎలక్ట్రిసిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల పాటూ దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. బైపాస్ పనులు 98 శాతం మేర పూర్తయ్యాయని, త్వరలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బైపాస్‌ను ప్రజలకు అంకితం చేయనున్నట్లు తెలిపారు.

ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

తొలిరోజు రెండు సెంచరీలు నమోదు



కె.నిఖిలేశ్వరరెడ్డి, 116 పరుగులు



శశాంక్ శ్రీవాత్స, 154 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్.కె.ఆర్.బి.ఆర్. క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సౌత్‌జోన్, సెంట్రల్‌జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు సెంచరీలు సాధించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌత్‌జోన్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 368 పరుగులు సాధించింది. జట్టులోని శశాంక్ శ్రీవాత్స 162 బంతుల్లో 12 ఫోర్లు, 10 సిక్స్‌లతో 154 పరుగులు, కె.నిఖిలేశ్వరరెడ్డి 268 బంతుల్లో 15 ఫోర్లుతో 116 పరుగులు సాధించారు. సెంట్రల్‌జోన్ బౌలర్ సుశాంత్‌నాయుడుకు 2వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

14 మంది కానిస్టేబుళ్లు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో 14 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి రూరల్, తాడేపల్లి పీఎస్‌ల నుంచి ఎనిమిది మంది, మంగళగిరి టౌన్, పొన్నూరు రూరల్ పీఎస్‌ల నుంచి ఇద్దరు చొప్పున జిల్లాలోని వేర్వేరు పీఎస్‌లకు బదిలీ అయ్యారు. తెనాలి టూటౌన్ పీఎస్, కొత్తపేట పీఎస్ నుంచి ఒక్కొక్క కానిస్టేబుల్‌ను బదిలీ చేశారు.

రేపు అండర్-19 టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపికలు



సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న గుంటూరు నగరంలోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో టేబుల్ టెన్నిస్ అండర్ -19 బాల, బాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి. నరసింహారావు మంగళ వారం తెలిపారు.ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. 2006 జనవరి 01 తర్వాత జన్మించిన వారు, ఇంటర్మీడియట్ విద్యనభ్యశిస్తున్న వారు అర్హులన్నారు. కళాశాల ధృవపత్రంతో హాజరు కావాలని కోరారు. నిర్వహణ అధికారిగా సి.హెచ్. పద్మాకర్ వ్యవహరిస్తారన్నారు. ఇతర వివరాలకు జి.నరసింహారావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి, ఉమ్మడి గుంటూరు జిల్లా, సెల్ 94402 35756 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సంస్కృతిలో స్వచ్ఛత భాగమవ్వాలి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపు
- నరసరావుపేటలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు, పౌరులు



ర్యాలీకి పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నరసరావుపేట: మన సంస్కారంలో, స్వభావంలో స్వచ్ఛత వెల్లివిరియాలని, స్వచ్ఛత జీవన విధానంగా మారి జిల్లా ప్రజల సంస్కృతిలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ పల్నాడు బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సెప్టెంబరు 17 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన 'స్వచ్ఛతా హి సేవ' పథకంలో భాగంగా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. మూడు విభాగాలుగా ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి చెత్తను తొలగించడం, పారిశుద్ధ్య కార్మికులకు కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి కనీస వసతులు కల్పించడం, స్వచ్ఛతను పెంపొందించడంలో ప్రజలను భాగస్వాములను చేయడం లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డీపీవో కేవీ భాస్కరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉషారాణి, టీడీపీ నాయకులు కపిలవాయి విజయకుమార్, ర్యాలీలో భారీగా విద్యార్థులు, పట్టణ పౌరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్న విశ్వకర్మ యోజన పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. విశ్వకర్మ డివైన్, స్వయంబు ఇంజినీరని కొనియాడారు. పురాణాలలో విశ్వకర్మ స్వర్గలోక సృష్టికర్తని, ప్రపంచానికి అసలైన సృష్టికర్తని, కలియుగంలో పాండవులకు మయసభ శిల్పిగా, దేవతలకు ఆయుధాలు తయారు చేశారన్నారు. ఆయన పంచాముఖుడని, ఆయన దేవాలయాలు మచిలీపట్నం, చిలకలూరిపేటలో ఉన్నాయన్నారు. విశ్వకర్మల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 18 వృత్తులవారు విశ్వకర్మ యోజన్ పథకాన్ని ఎం.ఎస్.ఎం.ఈ ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమలోని నైపుణ్యాన్ని అంతరించిపోకుండా భావితరాల వారికి అందేలా చూడాలన్నారు. విశ్వ బ్రాహ్మణ సంగం జిల్లా అధ్యక్షులు సుతారం వాసు మాట్లాడుతూ దేవతలకే ఇంజినీరు విశ్వకర్మ అని, పంచ వృత్తులు, నిర్మాణ రంగంలో విశ్వకర్మ నిండియున్నారన్నారు. బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి, బ్రహ్మంగారి మునిమనుమడు వెంకటాద్రి స్వామి మాట్లాడుతూ విశ్వకర్మ వేయి కళలకు అధినేత అని అన్నారు. విశ్వకర్మ సృష్టించిన కట్టడాలు నేటికి ప్రాచుర్యంలో ఉన్నాయన్నారు. కార్యక్రమం అనంతరం బ్రహ్మంగారి మనుమడు వెంకటాద్రి స్వామిని జిల్లా కలెక్టర్ సముచిత రీతిలో సత్కరించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి కె.వి నాయకం, పలు సంఘాల నాయకులు స్వామి, కోటేశ్వరరావు పాల్గొనారు.

సాగర్ చెక్‌పోస్ట్ వద్ద గోవా మద్యం పట్టివేత

1236 మద్యం ఫుల్ బాటిళ్లు, 72 బీర్ టిన్నులు స్వాధీనం



స్వాధీనపర్చుకున్న మద్యం, లారీ

విజయపురిసౌత్: ఆంధ్ర- తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నాగార్జునసాగర్ అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న రూ.4,54,000 లక్షల విలువైన 1236 మద్యం ఫుల్ బాటిళ్లు, 72 బీర్ టిన్నులను స్వాధీన పరచుకున్నట్లు మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా వెల్లడించారు. మంగళవారం విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాగార్జునసాగర్ పోలీస్ చెక్ పోస్ట్‌లో అనుమానాస్పదంగా ఉన్న దోస్తు అశోక్ లైలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా భారీగా గోవాకు చెందిన మద్యం పట్టుబడినట్లు తెలిపారు. నిందితులను పట్టుకొని విచారించగా మద్యాన్ని గోవా రాష్ట్రం నుంచి గుంటూరుకి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితుల నుంచి 1236 ఫుల్ బాటిల్స్ మద్యం, 72 బీరు కేసులు స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా అక్రమంగా బియ్యం, లిక్కర్, మైనింగ్ కి సంబంధించి రవాణా చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లు సోమ్లా నాయక్, సోమయ్య, సిబ్బంది ఉన్నారు.

సత్తెనపల్లిలో వెల్లివిరిసిన మతసామరస్యం

- హిందూ-ముస్లింలు కలసి గణనాథుడికి పూజలు
- 22న నిమజ్జనానికి ఏర్పాట్లు



సత్తెనపల్లి వడ్డవల్లిలోని జెండాచెట్టువీధిలో పూజలందుకున్న వినాయకుడు

సత్తెనపల్లి: మత సామరస్యం వెల్లి విరిసేలా హిందువులు, ముస్లింలు కలిసి వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం లోని వడ్డవల్లి 18వ వార్డు జండా చెట్టు వీధి సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముస్లింలు, హిందువులు కలిసి రూ.2.200 లక్షలతో హైదరాబాద్ నుంచి వినాయక విగ్రహాన్ని తెప్పించి పూజలు నిర్వహిస్తున్నారు. 17 రోజుల పాటు పూజలు నిర్వహించి ఈ నెల 22న నిమజ్జనం చేయనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా మండపం కమిటీ సభ్యులు షేక్ రోహిత్, గండేపల్లి వెంకట్రావు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కుంకలగుంటలో ఉద్రిక్తత

- భారీ ఎత్తున పోలీసులతో నిఘా
- వినాయక నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ
- కొనసాగుతున్న 144 సెక్షన్



కుంకలగుంటలో ఇనుప కంచె ఏర్పాటు చేసి పహారా కాస్తున్న పోలీస్ బలగాలు

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా స్వల్ప వాదులాట ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ కాస్తా రెండు సామాజిక వర్గాల మధ్య వివాదంగా మారింది. ఘర్షణకు దిగిన ఇరు సామాజిక వర్గాల వారు అధికార టీడీపీ చెందిన వారు కావడంతో ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. దీంతో పల్నాడు జిల్లా ఎస్పి కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో మరో ఇద్దరు డీఎస్పీలు, సీఐ ఎం.రాంబాబుతో మరో ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, మరో 130 మంది వరకు పోలీస్ సిబ్బంది నిఘాలో మంగళవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. 144 సెక్షన్ కొనసాగిస్తున్నారు.

రెండురోజుల క్రితం టీడీపీకి చెందిన ఒక సామాజికవర్గం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆ ఊరేగింపులో అదే పార్టీకి చెందిన మరొక సామాజిక వర్గానికి చెందిన యువకుడిపై దాడి జరిగినట్లు సమాచారం. దీంతో దాడిచేసిన సామాజికవర్గం వారి వినాయక నిమజ్జనం సోమవారం రాత్రి జరుగుతుండడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అత్యంత సమస్యాత్మక గ్రామం కావడంతో కలకలం రేపింది. దీంతో సుమారు 30 మందికి పైగా పోలీస్ బలగాలతో రూరల్ సీఐ ఎం.రాంబాబు, నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్‌లు హుటాహుటిన గ్రామానికి చేరుకొని అర్థరాత్రి వరకు పోలీస్ సైరన్ మోగిస్తూ కట్టడి చేశారు. దీంతో సోమవారం భారీ ఘర్షణకు తెరపడింది. మంగళవారం మరొక సామాజిక వర్గానికి చెందిన వారి వినాయక నిమజ్జనం కావడంతో తిరిగి ఘర్షణలకు దారితీస్తుందన్న ముందస్తు సమాచారం మేరకు పెద్దఎత్తున పోలీస్ బలగాలను మోహరింపచేసి కాపలా కాస్తున్నారు. ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. ఘర్షణకు దిగిన ఇరు సామాజికవర్గాల వారు అధికార టీడీపికి చెందిన వారు కావడంతో ఆపార్టీ నేతలకు తలనొప్పిగా మారినట్లు సమాచారం.

పంచాయతీలకు నూతన గ్రేడ్లు..!

- శాఖకు చేరిన జనాభా, ఆదాయ వివరాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,183 పంచాయతీలు
- గ్రేడ్ల ఆధారంగానే కార్యదర్శుల నియామకం
- బదిలీలలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ సూచనలు అమలు



గ్రామ సచివాలయం

బెల్లంకొండ: గ్రామ పంచాయతీలకు త్వరలో నూతన గ్రేడ్లు రానున్నాయి. జనాభా, ఆదాయాన్ని అనుసరించి ఈ మార్పునకు కార్యాచరణ సిద్ధమైంది. పీఆర్ అండ్ ఆర్‌డీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాలోని ఈ వివరాలను కమిషనర్ ఆఫ్ పంచాయతీ రాజ్ (సీపీఆర్)కు అధికారులు పంపారు. 2011 జనాభా, గత మూడు సంవత్సరాలుగా వస్తున్న తలసరి ఆదాయ వివరాలను అందజేశారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లగా మారని గ్రేడ్ల వ్యవహారంలో కదలిక రాబోతోంది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆదాయం ఉన్నా వ్యత్యాసం

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలకు ఆదాయం ఎక్కువగానే ఉన్నప్పటికీ గ్రేడ్‌లలో వ్యత్యాసం ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న గ్రేడ్లు రెండు దశాబ్దాల క్రితం నాటి ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ప్రస్తుతం గ్రామాలలో జనాభా, ఆదాయం వివరాలలో భారీ వ్యత్యాసాలు వచ్చాయి. మున్సిపాలిటీల సమీపంలో ఉన్న పలు పంచాయతీలకు వివిధ రూపాల్లో ఆదాయ వనరులు కూడా పెరిగాయి. పలు రకాల టాక్స్‌ల ద్వారా ఆదాయం ఎక్కువగా వస్తోంది. గ్రేడ్ల వారీగా పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో కూడా మార్పులు ఉన్నాయి. కొందరు పనిభారం తగ్గించుకునేందుకు తక్కువ గ్రేడ్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నారు. మరికొందరు తక్కువ గ్రేడ్ కార్యదర్శులు ఎక్కువ గ్రేడ్ పంచాయతీలో పని చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆదాయం ఆధారంగా మార్పులు

కమిషనర్ ఆఫ్ పంచాయతీ రాజ్ నిబంధనల మేరకు జనాభా, తలసరి ఆదాయాలకు అనుగుణంగా పంచాయతీల గ్రేడ్లు మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా మారితే కార్యదర్శులకు తప్పనిసరిగా స్థానచలనం కలుగుతుంది. ఆదాయాలకు అనుగుణంగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అర్హులైన కార్యదర్శులను నియమించే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంలో కచ్చితంగా నిబంధనలను అమలు చేయాలని అధికారులు యోచిస్తున్నారు.

కార్యదర్శి గ్రేడ్‌ని బట్టి నియమించాలని ఇటీవలే డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్లలో వ్యత్యాసం ఉంటే జీతాలు విడుదలలో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కచ్చితంగా గ్రేడ్లను అనుసరించేందుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ మొత్తం కొద్ది రోజుల్లోనే పూర్తి అవుతుందని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదీ పరిస్థితి..

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా జిల్లా పంచాయతీ అధికారి వివరాల మేరకు... మొత్తం 1,183 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో రూ.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి(గ్రేడ్-1) 230, రూ.3 లక్షలు-రూ.5 లక్షలలోపు ఆదాయం కలిగినవి (గ్రేడ్-2) 129, రూ.లక్ష - రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్నవి (గ్రేడ్-3) 201 , రూ.లక్ష కంటే తక్కువ ఆదాయం పొందుతున్నవి (గ్రేడ్-4) 195, గ్రేడ్-5 పంచాయతీలు 427 ఉన్నాయి. ఇక గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గ్రేడ్ 1 కార్యదర్శులు 230 మంది, గ్రేడ్ 2 - 48, గ్రేడ్ 3 - 135, గ్రేడ్ 4 - 150, గ్రేడ్ 5 - 427 మంది కలిపి మొత్తం 990 మంది పనిచేస్తున్నారు.

వివరాలు అందజేశాం

పంచాయతీల వివరాలను కమిషనర్ ఆఫ్ పంచాయతీ రాజ్ కోరడంతో జిల్లాకు సంబంధించినవి అందజేశాం. ఆయా గ్రామాల జనాభా, ఆదాయం వివరాలు అందులో పొందుపరిచాం. గ్రేడ్‌ల ఆధారంగానే ఇక నుంచి కార్యదర్శుల బదిలీలు జరిగే అవకాశం ఉంది. డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ నిబంధనలు కూడా అలాగే ఉన్నాయి. కొద్ది రోజుల్లోనే గ్రేడ్‌ల ప్రక్రియ పూర్తి అవుతుంది.

– శ్రీదేవి, జిల్లా పంచాయతీ అధికారి, గుంటూరు